

సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ముస్త్యాలలో పిచ్చి మొక్కలతో మూసుకుపోయిన దేవాదుల కాల్వ



సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ముస్త్యాలలో ఎండిపోయిన పంటను చూపిస్తున్న రైతు అంజయ్య

# మూసుకుపోయిన దేవాదుల కాల్వలు

## వందలాది ఎకరాల్లో ఎండిపోతున్న పంటలు.. బోర్లు కూడా పోస్తలేవని రైతుల ఆందోళన

చేర్యాల, మార్చి 26 : సిద్దిపేట జిల్లా చేర్యాల ప్రాంతంలో వందలాది ఎకరాల్లో వరి ఎండిపోతున్నది. అసలే దుర్భిక్ష ప్రాంతం కావడం, కాంగ్రెస్ సర్కారు సాగునీరు విడుదల చేయకపోవడంతో దేవాదుల కాల్వలు చెత్తాచెదారంతో నిండి మూసుకుపోయాయి. దేవాదుల ప్రాజెక్టులో భాగంగా కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి, ఐనాపూర్ గ్రామాల మధ్య రిజర్వాయర్ నిర్మించారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో పదేండ్లపాటు దేవాదుల నుంచి నీటిని లిఫ్ట్ చేసి రిజర్వాయర్ నింపి అక్కడ నుంచి కాల్వల ద్వారా చేర్యాల ప్రాంతంలోని చెరువులు, కుంటలు నింపడంతో భూగర్భ జలాలు పెరిగి బోరుబావుల నుంచి పుష్కలంగా నీరు వచ్చి పంటలు దిగుబడి పెరిగింది. కాంగ్రెస్ వచ్చాక దేవాదుల నుంచి నీళ్లు లిఫ్ట్ చేయకపోవడంతో తపాస్‌పల్లి రిజర్వాయర్ అడుగంటి పోవడంతో ఈ ప్రాంతంలో భూగర్భజలాలు తగ్గిపోయి రైతుల బోర్ల నుంచి చుక్క నీరు రాకపోవడంతో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో సుమారు 1500 ఎకరాల్లో వరి పంట ఎండిపోయింది. రిజర్వాయర్లు నింపి రైతుల పంటలు కాపాడాలని అసెంబ్లీలో స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కానీ, తపాస్‌పల్లికి చుక్క నీరు రానివ్వడం లేదు. చేర్యాల మండలం ముస్త్యాలలోని జక్కుల, తాళ్ల చెరువు ఏటా గోదావరి జలాలతో నింపడంతో గ్రామంలో కరువు కనిపించకుండా పోయింది. కాంగ్రెస్ వచ్చాక ఈ చెరువుకు చుక్క నీరు రాలేదు. దీంతో గ్రామంలోని బోర్లు వట్టిపోయాయి. ఒక్కో రైతు రెండు,మూడు బోర్లు వేయించినా ఫలితం లేకుండా పోయింది. ముస్త్యాల గ్రామానికి చెందిన తరిగొప్పుల అంజయ్య అనే రైతు కుటుంబానికి నాలుగున్నర ఎకరాల భూమి ఉన్నది. పదేండ్లలో బోరు నుంచి పుష్కలంగా నీళ్లు వచ్చి పంటలు మంచిగా పండాయి. పదేండ్ల నుంచి మంచిగా నీరుపోసిన బోరు ఈసారి ఎండిపోవడంతో పంటలు కాపాడుకునేందుకు అప్పు చేసి రైతు అంజయ్య మరోరెండు బోర్లు తవ్వించాడు. అందులో ఒక్క బోరు నుంచి దుబ్బ తప్ప ఏమీ రాలేదు. మరోబోరు నుంచి కొద్దిపాటిగా నీళ్లు వస్తుండటంతో మోటర్ బిగించాడు. నాలుగున్నర ఎకరాల్లో ఎకరన్నర ఎండిపోగా మిగిలిన మూడు ఎకరాలను కాపాడుకునేందుకు ముప్పుతిప్పలు పడుతున్నాడు.

### • పది లక్షల అప్పు అయ్యింది..

కేసీఆర్ ఉన్నప్పుడు రెండు చెరువులకు నీళ్లు వచ్చినయి. ఇప్పుడు ఏమైందో ఒక్క చుక్క నీరు రాక చెరువులు ఎండిపోయినయి. బోరు నుంచి వచ్చే నీళ్లు రావడం లేదు. ఎకరన్నర వరి ఎండిపోయింది. రెండుబోర్లు వేయిస్తే ఒక్కటి పోయింది. ఇంకోదాంట్లో నుంచి కొద్దికొద్దిగా గ్యాప్ ఇచ్చుకుంటూ నీళ్లు వస్తున్నయి. పంట చేతికి వస్తుందో లేదో అనుమానంగా ఉంది. పంటలు చేతికి రాకపోతే మందు డబ్బానే దిక్కు. పది లక్షల రూపాయల అప్పులున్నయి. ఎట్ల అప్పులు తేర్చాలో తెల్వడం లేదు. మేస్త్రీ పనిచేస్తూ ఎవుసం చేసుకునేటోన్ని. ఇప్పుడు నీళ్లు లేక ఎవుసం నడవడం లేదు. నిర్మాణ పనులు సైతం తగ్గిపోయాయి. నాకు రుణమాఫీ కూడా కాలేదు.

-తరిగొప్పల అంజయ్య, రైతు, ముస్త్యాల, చేర్యాల మండలం (సిద్దిపేట జిల్లా)

### • కాల్వ ఇట్లా.. నీళ్లెట్లా?



ఆదిలాబాద్ జిల్లా మత్తడి ప్రాజెక్టు కాల్వల నిర్వహణ అధ్వానంగా మారింది. ఈ ప్రాజెక్టు ఎడమ కాల్వ కింద 8,500 ఎకరాల ఆయకట్టు ఉంది. కాల్వల్లో చెత్తాచెదారం, ఎండిన మొక్కలు పేరుకుపోవడంతో ఆయకట్టుకు నీరు అందడం లేదు. కాల్వలకు మరమ్మతులు చేసి నీటిని అందించాలని రైతులు కోరుతున్నారు. -ఆదిలాబాద్

### • మహ్మదాబాద్‌లో ఎండిన 140 ఎకరాలు



రైతులకు సాగు కష్టాలు తప్పడం లేదు. ఉమ్మడి పాలమూరు జిల్లా మహ్మదాబాద్ మండలంలో 5,500 ఎకరాల్లో వరి సాగు చేయగా.. నీటి తడులు అందక 140 ఎకరాల్లో వరి పొలాలు బీటలువారాయి. కంచన్‌పల్లికి చెందిన రైతు రాంపురం శ్రీనివాస్ పొలంలోని బోర్లలో నీటిమట్టం తగ్గడంతో దాదాపు రెండెకరాల్లో పంట ఎండింది. మిగతాది కూడా తడారి ఎండు దశకు చేరింది. -మహ్మదాబాద్

### • టమాట రోడ్డుపాలు




టమాటకు మార్కెట్‌లో ధర లేకపోవడంతో రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం గంగన్నగూడకు చెందిన రైతు టీ ప్రవీణ్‌రెడ్డి తీవ్రంగా నష్టపోయాడు. ఎకరాకు రూ.25 వేల చొప్పున మూడెకరాల్లో పంట సాగు చేశాడు. గురువారం 100 బాక్సులను మహబూబ్‌నగర్ మార్కెట్‌కు తరలించగా, దళారులు రూ.3 కిలో చొప్పున అడగడంతో తీవ్ర అసహనానికి గురయ్యాడు. తీసుకెళ్లిన వాహనానికి డీజిల్‌కు సరిపడా డబ్బులు కూడా రావని గ్రహించి వాహనాన్ని వెనక్కి తీసుకొచ్చాడు. దారిలో ఫతేపూర్ మైసమ్మ వద్ద రోడ్డు పక్కన పారబోసి దున్నపోతులకు ఆహారంగా పెట్టాడు. -కొందుర్గు

### • కాంగ్రెస్ సర్కార్ పైసా ఇయ్యలే



కాంగ్రెస్ సర్కార్ వచ్చినంక రైతులకు సాయం చేయలేదని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామానికి చెందిన రైతు చిట్టె పాపయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు పెట్టుబడి సాయం చేశారని, అప్పుడు ఫికరే ఉండేది కాదన్నాడు. నీళ్లు లేక పంటంతా ఎండిపోయిందని, అప్పు రూ.రెండు లక్షలు భూమిపాలైనట్టు చెప్పాడు. ఎండిన పంట మూగజీవాల పాలవుతుందని పేర్కొన్నాడు. -ఇబ్రహీంపట్నం

### • పశువుల మేతకు జొన్న పంట



ఆదిలాబాద్ జిల్లా హస్నాపూర్‌కు చెందిన రైతు దర్శనాల రవికిరణ్ తన నాలుగెకరాల్లో రూ.40 వేల పెట్టుబడి పెట్టి జొన్న విత్తాడు. మత్తడి ప్రాజెక్టు కుడి కాల్వ ద్వారా నీరు అందుతుందనే నమ్మకంతో సాగు ప్రారంభించాడు. రోజురోజుకు నీటి సమస్య పెరిగి భూగర్భజలాలు అడుగంటాయి. ఫలితంగా పంట ఎండిపోవడంతో గురువారం మూగజీవాలకు మేతగా వదిలేశాడు. మిగిలిన పంటలనైనా కాపాడుకోవడానికి కుడి కాల్వ ద్వారా నీరందిస్తే బాగుంటుందని రైతులు కోరుతున్నారు. - తాంసి

### • సాగునీళ్ల కోసం కలెక్టరేట్ వద్ద ఆందోళన



జోగుళాంబ గద్వాల జిల్లాలోని కొత్తపల్లి, గుంటిపల్లి, రేకులపల్లి, చెనుగోనిపల్లి గ్రామాల రైతులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. పలువురు రైతులు మాట్లాడుతూ.. జూరాల కుడి కాల్వ కింద రైతులు వారబందీ ప్రకారం నీరు విడుదల చేయడం లేదని ఆరోపించారు. దీంతో పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. -గద్వాల

## అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

- సిద్దిపేట జిల్లాలో పురుగుల మందు తాగిన వెంకటయ్య
- ఖమ్మం జిల్లా లో మిర్చి ధరలేక ఉరేసుకున్న ఉప్పలయ్య

ఖమ్మం రూరల్ / తొగుట, మార్చి 27 : సాగునీరు అందక, పంటకు గిట్టుబాటు ధర లేక ఖమ్మం, సిద్దిపేట జిల్లాల్లో అప్పుల బాధతో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లికి చెందిన గుమ్మడిదల వెంకటయ్య (47) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఏడాది క్రితం పెద్ద కూతురు నాగలక్ష్మి పెళ్లి చేశాడు. వారసత్వంగా వచ్చిన 2 ఎకరాల భూమిలో యాసంగిలో వరి పంట వేశాడు. సాగునీరు రాక వరిపంట పూర్తిగా ఎండిపోయింది. కూతురు పెళ్లికి, సాగుకు తెచ్చిన అప్పు అలాగే ఉండడంతోపాటు చిన్న కూతురు ఆశ్విత కూడా పెళ్లీడుకు వచ్చింది. ఈ క్రమంలో అప్పు రూ.5 లక్షలు ఎలా తీర్చాలోనని తీవ్ర మనస్తాపానికి గురైన వెంకటయ్య ఈ నెల 24న పురుగులమందు తాగాడు. సిద్దిపేట ఏరియా దవాఖానలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెం గ్రామానికి చెందిన బోనగిరి ఉప్పలయ్య(43) తనకున్న 1-20 గుంటల భూమితోపాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకొని మిర్చి సాగు చేశాడు. చేతికొచ్చిన పంటను ఈ నెల 25న ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించాడు. పంటకు ఆశించినమేర ధర లేకపోవడం.. సాగు కోసం చేసిన అప్పులు తీర్చడానికి అవసరమైన డబ్బులు రాకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. బుధవారం ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిన ఉప్పలయ్య కౌలుకు తీసుకున్న భూమిలో వేపచెట్టుకు ఉరేసుకున్నాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఉప్పలయ్య భార్య ఉపేంద్ర, కుమారుడు మల్లేశ్, బంధువులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### • నీళ్లు లేక.. పంట జీవాల పాలు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూర్‌పల్లి గ్రామ నల్ల చెరువు కింద దాదాపు 20 ఎకరాలు, గారెపల్లి చింతల చెరువు కింద సుమారు 30 ఎకరాల వరి పంట ఎండిపోయింది. దీంతో రైతులు పంటను జీవాలకు వదిలేస్తున్నారు. -కాటారం



### కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం అంతారంలో లోవోల్టేజీ కారణంతో ట్రాన్స్‌ఫార్మర్ బుడ్డీలు కాలిపోయాయి. చేవెళ్లకు తీసుకెళ్లి మరమ్మతు చేయించుకొని వచ్చారు. ఒక్క రోజు వ్యవధిలోనే మళ్లీ కాలిపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ బుడ్డీని చేవెళ్లకు తరలించారు. దీంతో తమపై ఖర్చుల భారం పడుతున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. -షాబాద్



### మిర్చి రైతు అర్ధనగ్న ప్రదర్శన

ఖమ్మం జిల్లా రూరల్ మండలం కస్నాతండాకు చెందిన రైతు భూక్యా నాగేశ్వరరావు మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని గురువారం అర్ధనగ్న ప్రదర్శన చేశాడు. మెడలో మిర్చి దండ, చేతిలో ప్లకార్డుతో తన మిర్చి కల్లంలో గంటపాటు నిరసనకు దిగాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిట్టుబాటు ధరతోపాటు అర్హులైన రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశాడు. - ఖమ్మం రూరల్

### • బస్వన్నపల్లిలో తాగునీటికి తండ్లాట




కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం బస్వన్నపల్లిలో తాగునీటికి కటకట ఏర్పడింది. కేసీఆర్ హయాంలో ప్రారంభించిన మిషన్ భగీరథ పథకంతో ఈ గ్రామానికి నీటి కష్టాలు తొలగిపోయాయి. కొన్ని రోజులుగా భగీరథ నీళ్లు రావడం లేదని గ్రామస్థులు చెప్తున్నారు. గ్రామంలో ఉన్న దాదాపు 50 చేద బావులే ప్రస్తుతం తమకు ఆసరాగా నిలుస్తున్నాయని అంటున్నారు. బావులు లేని వారు రూ.1,200 పెట్టి వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చుకోవాల్సి వస్తున్నదని చెప్తున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. - రాజంపేట

## అధికారులకు చుక్కెదురు

- కొడంగల్ లిఫ్ట్ భూసేకరణ నోటీసుల తిరస్కరణ
- మక్తల్ మండలం కాట్రేవుపల్లి జీపీలో అతికించి వెళ్లిన వైనం

మక్తల్, మార్చి 27: నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భాగంగా భూసేకరణ చేస్తున్న అధికారులకు చుక్కెదురైంది. భూములు కోల్పోతున్న వారికి నోటీసులు ఇవ్వడానికి అధికారులు వెళ్లగా రైతులు తిరస్కరించారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కాట్రేవుపల్లి శివారులో కొడంగల్ లిఫ్ట్ ప్రధాన పంప్‌హౌస్ నిర్మాణానికి 49 మంది రైతులు భూమిని కోల్పోతున్నారు. 64 ఎకరాలకు సంబంధించి ఏ రైతు ఎంత భూమిని కోల్పోతున్నాడని నోటీసులు సిద్ధం చేసి వాటిని సంబంధీకులకు ఇవ్వడానికి మక్తల్ ఆర్ఐలు రాములు, భూపాల్‌రెడ్డి వెళ్లగా కాట్రేవుపల్లి రైతులు తిరస్కరించారు. ఎర్నగానిపల్లికి చెందిన ఒకరిద్దరు మాత్రం ఏమిటో తెలియకుండానే తీసుకున్నారు. అందరూ ముందుకు రాకపోవడంతో చేసేది లేక అధికారులు కాట్రేవుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో భూములు కోల్పోతున్న రైతుల వివరాలు ఉన్న నోటీసును అతికించి వెనుతిరిగారు. కొడంగల్ లిఫ్ట్‌లో భూములు కోల్పోయే కాట్రేవుపల్లి రైతుల సంతకాలు సేకరించి అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తానని వారం క్రితం మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి చెప్పారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నా.. పరిహారం విషయంలో స్పష్టమైన వైఖరి చెప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు.



కాట్రేవుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో భూ నిర్వాసితుల నోటీస్‌ను గోడకు అతికించిన రెవెన్యూ అధికారులు

### • ఎంపీడీవో కార్యాలయానికి తాళం



పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచులు గురువారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ఎంపీడీవో కార్యాలయానికి తాళంవేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు, పల్లె ప్రకృతివనాలు, మన ఊరు-మనబడి.. తదితర అభివృద్ధి పనులు చేపట్టి రెండేళ్లు కావస్తున్నదని చెప్పారు. బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కోసిన గ్రామ పంచాయతీకి రూ. 22 లక్షలు, ఎన్‌జీవోస్‌కు రూ. 40 లక్షలు. బారేగూడకు రూ.14 లక్షలు, జగన్నాథ్‌పూర్‌కు రూ.22 లక్షలు, అందెవెళ్లికి రూ.9 లక్షలు, బోడేపల్లికి రూ.42 లక్షలు, భట్‌పల్లికి రూ.35 లక్షలు, ఇలా 20 గ్రామ పంచాయతీలకు బిల్లులు రావాల్సి ఉన్నదని పేర్కొన్నారు. సర్కారు వెంటనే స్పందించి బిల్లులు మంజూరు చేయాలని కోరారు. -కాగజ్‌నగర్